# తృప్తి ఒకరిది, ఘనత మరొకరిదీ!

- ఇంద్రగంటి నరసింహమూర్తి

**"అదేనండీ** సమస్య" అంది శ్రీమతి.

మా శ్రీమతి చెప్పిన సమస్యలు విని నేనేం ఆశ్చర్యపడలేదు. ఈ నాడు నూటికి తొంభై మధ్యతరగతి సంసారాలు ఎదుర్కొనే సమస్యలివి. నిరుద్యోగం, వరకట్నం ఈ నాటి యువతీ యువకులను పట్టి పీడిస్తున్న సమస్యలు.

మే ముంటున్న ఇంట్లో మూడు వాటాలు ఉన్నాయి. మధ్య వాటాలో మేము కాపుర ముంటున్నాం. కుడివైపు వాటాలో కనకారావుగారి కుటుంబం. వారి పెద్దబ్బాయి గోపాలం. బి. ఎ. పట్టా పుచ్చుకుని మూడేళ్ళు కావస్తోంది. ఈ మూడేళ్ళుగా ఎక్కే గుమ్మం, దిగే గుమ్మం. ఉద్యోగం మాత్రం రావడం లేదు. నిరుద్యోగిగా నిరుత్సాహంతో కాలక్షేపం. ఉద్యోగం రావాలంటే ముడుపు చెల్లించాలి. అందుకు అతగాడి తండ్రి దగ్గరున్న డబ్బు చాలదు. అతని దగ్గరున్న డిగ్రీ ఉద్యోగాన్ని సంపాదించలేక పోతూంది. కనకారావుగారి భార్య నా భార్యామణికీ సంగతి చెప్పి, "మా వాడీ మధ్య తిండికూడా సరిగా తినలేక పోతున్నాడు. బెంగతో చిక్కి శల్యమవుతున్నాడు" అందట కన్నీళ్ళతో.

వీరి సమస్య ఇలా ఉంటే—

మా ఎడమచేతి పక్క వాటాలో ఉండే సన్యాసిరావుగారి పెద్దమ్మాయి శకుంతలకు పెళ్ళి ఈడు వచ్చింది. అమ్మాయికి ఇరవయ్యేళ్ళొచ్చేటప్పటికి తండ్రి దగ్గర కనీసం ఇరవై వేలన్నా లేకపోతే ఆ అమ్మాయి అతని గుండెమీది కుంపటి కాకమానదు. ఇరవైవేల మాట దేవుడెరుగు ఇరవై ఎందలన్నా లేవు సన్యాసిరావుగారి దగ్గర. ఇంక పిల్ల పెళ్ళేం చేయగలరు? అలాగని చేతులు ముడుచుకు కూర్చోలేరు. అప్పో సప్పో చేసి అమ్మాయి పెళ్ళి చేయాలనేదే ఆరాటం. పెళ్ళి చూపు లవుతున్నాయి. అమ్మాయి నచ్చుతున్నా, కట్న కానుకల దగ్గర ఎదుటివారి డిమాండుకు తల వంచలేక పోతున్నారు సన్యాసిరావుగారు. ఈ సంగతు లన్నీ చెప్పి "'నా జన్మలో అమ్మాయినో ఇంటిదాన్ని చేయగలనా?' అన్న బెంగతో వారు చిక్కి శల్య మవుతున్నారు" అని బావురుమందిట శకుంతల తల్లి.

ఈ సంగతు లన్నీ శ్రీమతి నాకు నివేదించింది. 'పిల్లలు పెద్ద వాళ్ళవుతున్న కొద్దీ పెద్దల కన్నీ సమస్యలే. కాలమహిమ' అని కామెంట్.

ఈ రోజు ఆదివారం బాంకుకు వెళ్ళ నక్కర లేదు. ఒక జాతీయం చేయబడిన బాంకు మానేజరుగా మా పక్క ఇంటి వారి సమస్యలను నే నేమైనా పరిష్కరించగలనా? అని చాలా సేపు ఆలోచించాను. కొంచెం సేపట్లో బుర్రలో ట్యూబ్‌లైటు వెలిగింది. ఆలోచన వచ్చిందే తడవుగా గోపాలాన్ని, శకుంతలను పిలిపించాను. కుశల ప్రశ్న లయ్యాక—"ఏమోయ్ గోపాలం! ఉద్యోగాల వేటలో అలసి పోయావని మీ అమ్మగారు అన్నారట. ఏదైనా వ్యాపారం ప్రారంభించ కూడదా?" అని అడిగాను.

పేలవంగా నవ్వా డతను. "పెట్టుబడి ఏది, సార్?" అన్నాడు.

"మా బాంక్‌లో స్వయం ఉపాధి పథకం క్రింద అప్పు ఇప్పిస్తాను. దానితో వ్యాపారం ప్రారంభించు. ఏ వ్యాపారమో అంతా నేను వివరిస్తాను. అయితే నీవు ఉత్సాహం చూపాలి. పట్టుదల ఉండాలి. కష్టపడి తిరగ గలగాలి. నీ వ్యాపారం వృద్ధిలోకి వచ్చిందంటే నువ్వే పది మందికి ఉద్యోగా లివ్వవచ్చు" అని నా పథకం వివరించాను. "ఇందులో నీ సహకారం కూడా కావాలి" అన్నాను శకుంతల వైపు తిరిగి.

"చెప్పండి ఏం చేయాలో" అంది శకుంతల.

నా పథకం వివరించాను.

శకుంతలకు కుట్టు పని చేతనవును కనక మా బాంకులో అప్పు తీసుకుని ఒక సూయింగ్ మెషీన్ కొంటుంది. బజారులో చవకగా కట్‌పీసెస్ కొని చిన్న పిల్లలకు అందంగా, ఆకర్షణీయంగా కనపడే చిన్న చిన్న గౌనులు, చొక్కాలు, లాగులు కుడుతుంది. బజారులో గార్మెంట్స్ షాపు ఓపెన్ చేసి గోపాలం నిర్వహిస్తాడు. ఇద్దరికీ మొదట పెట్టుబడికి కావలసిన డబ్బంతా మా బాంకు అప్పుగా ఇస్తుంది.

మొదట షాపులో సేల్స్ అంతగా లేకపోతే గోపాలం ఇంటింటికీ తిరిగికూడా అమ్మకం నిర్వహించవలసి ఉంటుంది. వాళ్ళకు వచ్చిన లాభాల్లోంచిఅప్పు నెమ్మదిగా తీర్చుకోవచ్చు.

ఇద్దరికీ నా సలహా నచ్చింది.

మిగతా విషయాలు చర్చించడానికి, కావలసిన ఫారమ్స్ వగైరా తీసుకోవడానికి మరునాడు బాంకుకు రమ్మన్నాను.

ఆ రోజు సాయంత్రం కనకారావుగారూ, సన్యాసిరావుగారూ వచ్చి కలిసి నా చేతులు పట్టుకుని, "మీ కెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియడం లేదు. మా వాళ్ళు మా కంతా చెప్పారు. వాళ్ళ బ్రతుకు వాళ్ళు బతకడానికి మీరు దారి చూపించడానికి ముందుకు రావటం నిజంగా మా అదృష్టం" అన్నారు.

"ఇప్పుడు నన్ను పొగడకండి. ఇందులో నేను చేసిందేమీ లేదు. అది నా ఉద్యోగధర్మం కూడాను. బాంకులను జాతీయం చేసినది ఇటువంటి వారికి జీవనోపాధి చూపడానికే. వారిద్దరూ వారి కాళ్ళ మీద వాళ్ళు నిలబడి నాలుగు డబ్బులు సంపాదించుకోగలిగితే సంతోషం" అన్నాను.

• • •


నే ననుకున్నట్టే వాళ్ళిద్దరూ చాలా చురుకైన వారు. త్వరలోనే వారి వ్యాపారం జోరుగా సాగడం ప్రారంభమైంది. గోపాలం ఇంటింటికీ తిరిగికూడా వ్యాపారం చేయసాగాడు. శకుంతల తయారు చేస్తున్న చిన్న పిల్లల బట్టలు చక్కగా ఉండి నలుగుర్నీ ఆకర్షించసాగాయి. మరో ఆరు నెలల తరవాత గోపాలం మరి కొంత అప్పు తీసుకుని షాపులో లుంగీలు, బనియనులుకూడా చేర్చాడు. అటు షాపులో సేల్స్‌మన్‌ను నెల జీతం మీద వేసుకుంటే, ఇటు శకుంతల బటన్స్ వగైరా కుట్టడానికీ, చిన్న చిన్న కటింగ్స్‌కూ మరో అసిస్టెంట్‌ను చేర్చుకుంది.

• • •

మరో ఆరు నెలల తరవాత—ఆ రోజు ఆదివారం.

ఉదయం పేపరు చూసి సిగరెట్టు వెలిగించాను.

పడక కుర్చీలో కూర్చుని శ్రీమతి వేస్తున్న పెసరట్టు ఆరగిస్తూంటే శకుంతల, గోపాలం "గుడ్‌మార్నింగ్, సార్" అంటూ వచ్చారు.






"రండి రండి. ఏమిటి విశేషాలు? ఈ మధ్య కలిసి చాలా రోజు లయింది" అన్నాను.

"విశేషమైనదే, సార్! మీకు చెప్పాలని" అని ఆగిపోయాడు గోపాలం.

"ఏమిటబ్బా అంతా విశేషం!" అన్నాను నవ్వుతూ.

"నేను...మేము..." అని ఆగిపోయాడు గోపాలం.

ఏం చెప్పబోతున్నాడో నా కర్థమయినా, మాట్లాడకుండా చిన్నగా నవ్వాను.

"అదేనండీ. మేము...ఇద్దరం" ఆగిపోయింది శకుంతల.

"ఊ. మీ రిద్దరూ?" రెట్టించాను.

"మేమిద్దరం..." సిగ్గుతో తల దాచుకుని, "మీరు చెప్పండి" అని గోపాలాన్ని చేత్తో పొడిచింది.

"పెళ్ళి చేసుకోబోతున్నాం అంటారు—అంతేనా?" అంటూ పెసరట్ల ప్లేట్లతో ప్రవేశం చేసింది శ్రీమతి.

ఇద్దరికీ చెరో ప్లేటూ అందించింది.

"కట్నం ఎంతేమిటి?" అన్నాను సందేహం తీర్చుకోవడానికి. "విలువ కట్టలేని శకుంతల మనసు, సార్" అని ఉత్సాహంగా అన్నాడు గోపాలం.

"మేమిద్దరం మీ కెప్పుడూ ఋణపడి ఉంటాం, సార్! కట్నం లేకుండా నిరాడంబరంగా రిజిస్ట్రార్ ఆఫీసులో మా పెళ్ళి. మీరు సాక్షి సంతకానికి రావాలి" అన్నారు గోపాలం.

"చాలా సంతోషం" అన్నాను.

కాస్సేపు కబుర్లు చెప్పి, వాళ్ళిద్దరూ వెళ్ళిపోయారు.

"ఇప్పుడు గోపాలం వ్యాపారం బాగానే సాగుతూందిట. శకుంతలకూడా కట్నం లేకుండా మొగుణ్ణి సంపాదించుకుంది. వాళ్ళిద్దర్నీ కలిపారు. బాగానే ఉంది. అయినా మనకేం ఒరిగిందీ?" శ్రీమతి సందేహం.

"ఒక మంచి పని చేశామన్న తృప్తి. ఏం చేయాలో తోచక అంధకారంలో అలమటిస్తున్న ఇద్దరికి ఒక దారి చూపించామన్న తృప్తి. ఆ దారిలో జీవితాల్ని నందనవనం చేసుకున్న ఘనత వారిదే" అన్నాను ఆనందంతో *